నమ్మలేని నిజాలు

మనిషి చావు
ఊహకందని జ్ఞానం
తత్వవిచారం.

రైతుయింట పెళ్లీ!
కన్యాశుల్కం లక్షలు
మారినకాలం

పంచక్లేశాలు
కేంద్రబిందువు పేద
అసమానత.

భూ భక్షకులు
జీర్ణం వాతాపి జీర్ణం
నిర్మలాకాశం.

వేసవి కాలం
పానీయాల స్వాగతం
తీరనిదాహం

- రేడియమ్
సెల్: 9291527757





# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com



తడితగిలిన ధాన్యంతో
రైతు కన్నీ కష్టాలే !
కష్టపడీ పండిస్తే
ఎల్లవేళ నష్టాలే !

ఆందోళన వద్దంటూ
రైతు భుజం తట్టి !
కొనక పోతే ప్రభుత్వం
కొట్టినట్టె మట్టి !

శ్రీనిజాలు

- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245





హైదరాబాద్ గురువారం 4-5-2023 RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 204 పేజీలు:6 వెల: రూ.1/-


## కోదండ రామాలయ పునర్‌నిర్మాణానికి మంత్రి అల్లోల భూమి పూజ



రాజన్న సిరిసిల్ల, మే3:(నేటి నిజం ప్రతినిధి): వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో పేదల దేవుడు వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, భక్తుల మెరుగైన వసతుల కల్పనకు కృషి చేస్తామని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. ఇప్పటికే రూ.100 కోట్లు వెచ్చించి చేపట్టిన భూసేకరణ, ఇతరత్రా అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయని పేర్కొన్నారు. వేములవాడ నియోజక వర్గంలోని కోనరావు పేట మండలం నాగారాంలో రూ.36 లక్షలతో పునర్‌నిర్మించనున్న కోదండ రామాలయ విగ్రహ ప్రతిష్ఠ, ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్, స్థానిక ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ పాల్గొన్నారు.

అంతకుముందు మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని దేవాలయాలకు పాలకమండళ్లను నియమించామని తెలిపారు. మిగిలిన ఆలయాల పాలక మండళ్ళ నియామకంపై ముఖ్యమంత్రి కేసీఆర్‌తో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. భగవంతులని ఆశీసుల వల్ల సకాలంలో సంవృద్ధిగా వానలు కురుస్తున్నాయని, పంటలు పుష్కలంగా పండుతున్నాయని వెల్లడించారు. సీఎం కేసీఆర్ కృషితో సాగునీటి కష్టాలు తీరాయని, రైతులు ఎంతో మేలు జరిగిందన్నారు.

## పోరాటంతోనే సమస్యలు పరిష్కారం- భట్టి విక్రమార్క

యాదాద్రి, మే 3: పోరాడితే పోయేది ఏమి లేదు.. బానిస సంకెళు తప్ప అని మహాకవి అన్నట్లుగా పోరాటంతోనే సమస్యలు పరిష్కార మవుతాయని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం పీపుల్స్ మార్చ్ పాదయాత్ర 48వ రోజుకు చేరుకుంది. యాదగిరిగుట్టలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని కుటుంబ సభ్యులతో దర్శనం చేసుకున్న అనంతరం పాదయాత్ర కొనసాగించారు. ఈ నేపథ్యంలో గత 405 రోజుల నుంచి రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఆటో డ్రైవర్లను కలసి సమస్యలను తెలుసుకున్నారు. యాదగిరి గుట్ట ఆలయాన్ని ప్రారంభించిన మరుసటి రోజు నుంచి కొండపైకి ఆటోల రాకపోకలను నిషేధించిందని వాపోయారు. దీంతో తమ బతుకులు రోడ్డున పడ్డాయని వారు ఆవేదనగా చెప్పారు. ఆటోలను కొండపైకి అనుమతించేలా చేయాలని ఆటో డ్రైవర్లు భట్టిని వేడుకున్నారు. ఈ సమస్యపై పోరాటం చేస్తామని చెప్పారు. ప్రభుత్వం స్పందించకపోయినా.. వచ్చే ఆరునెలల తరువాత కాంగ్రెస్ నేతృత్వంలో ఏర్పడే ఇందిరమ్మ రాజ్యంలో పరిష్కరిస్తామని, మీ ఆటోలను తిరిగి కొండపైకి అనుమతిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, మాజీ ఎమ్మెల్యే కుడుదుల నగేష్, బండ్రు శోభారాణి, బీర్ల ఐలయ్య, శ్రీశైలం, బుడిగే పెంటయ్య గౌడ్, ఇంజ నరేష్, బల్ల యాదేశ్ తదితరులు పాల్గొన్నారు.

## సూడాన్‌లో అంతర్యుద్ధం.. దేశం విడిచి వెళ్లిన 4 లక్షల 30 వేల మంది

న్యూఢిల్లీ, మే3:ప్రపంచంలోని అతి పేద దేశాల్లో ఒకటైన సూడాన్ అంతర్యుద్ధంతో అతలాకుతలమవుతున్నది. గత కొద్ది రోజులుగా దేశంలో తుపాకుల మోత మోగుతోంది. రెండు వర్గాలుగా విడిపోయిన సైనిక కమాండర్లు అధికారం కోసం ఒకరి మీద మరొకరు దాడులు చేసుకుంటున్నారు.

దీంతో లక్షల కొద్ది ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని దేశం విడిచి వెళ్లిపోతున్నారు.

భారీగా ఆస్తులు ధ్వంసమవుతుండటంతోపాటు జనాలు ప్రాణాలు కోల్పోతున్నారు. ఏప్రిల్ 15న సూడాన్ సాధారణ మిలిటరీ, ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ (ఆర్ఎస్ఎఫ్) అని పిలిచే పారామిలిటరీ బలగాల మధ్య ప్రారంభమైన ఆధిపత్య పోరాటం వల్ల ఇప్పటివరకు 3 లక్షల 30 వేల మందికి పైగా ప్రజలు వారివారి స్వదేశాలకు వెళ్లిపోయారని ఐక్యరాజ్యసమితి వెల్లడించింది.

మరో లక్ష మందికిపై గా సరిహద్దులు దాటి పారిపోయారని తెలిపింది. మొత్తంగా దేశం నుంచి 4 లక్షల 30 వేల మందికిపైగా దేశం నుంచి వెళ్లిపోయారని పేర్కొన్నది.

ఈ ఘర్షణలు ఇలాగే కొనసాగితే 8 లక్షల మందికిపైగా దేశం విడిచి వెళ్లిపోయే అవకాశం ఉందని ఐరాస శరణార్థుల సంస్థ అయిన యూఎన్‌హెచ్‌సీఆర్ అంచనావేసింది. కాగా అధికారం కోసం జరుగుతున్న ఈ పోరాటం వల్ల ఇప్పటి వరకు 500 మందికిపైగా చనిపోయారని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూ) తెలిపింది.

2021వ వరకు దేశంలో ప్రజాస్వామ్య ప్రభుత్వమే అధికారంలో ఉన్నది. అయితే దేశాన్ని మూడు దశాబ్దాలపాటు పాలించిన సూడాన్ అధ్యక్షుడు ఒమర్ అల్-బషీర్సూడాన్ సైన్యం ప్రభుత్వం తిరుగుబాటు చేసింది. నాటి నుంచి అక్కడ సైనిక ప్రభుత్వమే పాలన సాగిస్తోంది. సైనిక జనరల్స్ సభ్యులుగా ఉండే కౌన్సిల్ అధికారం చెలాయిస్తోంది. సైన్యాధ్యక్షుడు జనరల్ అబ్దెల్ ఫతా అల్ బుర్హాన్ కనుసన్నలలో మిలిటరీ కౌన్సిల్ నడుస్తోంది. సూడాన్‌కు ఒకరకంగా ఆయనే దేశాధినేత.

అయితే సైన్యంలోని మరొక టాప్ కమాండర్ జనరల్ మొహమ్మద్ హమ్దాన్ దాగలూ.. అబ్దెల్ ఫతా అల్ బుర్హాన్ మధ్య కొంతకాలంగా ఆధిపత్య పోరు జరుగుతున్నది.

నూతన వ్యవస్థలో ఎవరు ఎవరికి విధేయులుగా ఉండాలనే అంశమే దీనికి కారణమైంది. అదికాస్తా అబ్దెల్‌పై తిరుగుబాటుకు దారితీసింది.

దేశంలో అత్యంత బలమైనదిగా చెప్పే ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ బలగాలకు మొహమ్మద్ హమ్దాన్ నాయకత్వం వహిస్తున్నారు.

## ఈ నెల 9న హైదరాబాద్‌లో జీరో షాడో డే..

హైదరాబాద్, మే3: హైదరాబాద్ లో ఈనెల 9న ఓ అద్భుతం ఆవిష్కృతం కానుంది. సరిగ్గా ఆరోజు మధ్యాహ్నం 12:12 గంటల సమయంలో నీడ కనిపించని 'జీరో షాడో డే' ఏర్పడనుంది. ఈ విషయాన్ని బీఎం బిర్లా సైన్స్ సెంటర్ టెక్నికల్ అధికారి ఎన్.హరిబాబుశర్మ తెలిపారు. ఆ సమయంలో హైదరాబాద్‌లో సూర్య కిరణాలు నిట్టనిలువుగా పడతాయని చెప్పారు. అప్పుడు ఎండలో నిటారుగా ( 90 డిగ్రీల కోణం) ఉంచిన ఏ వస్తువు నీడా రెండు నిమిషాల పాటు అంటే 12:12 నుంచి 12:14 వరకు కనిపించదని పేర్కొన్నారు. మనం ఎండలో నిలుచున్నా.. మన నీడ సైతం కనిపించదని తెలిపారు.ఇదే విధంగా హైదరాబాద్ లో ఆగస్టు 3వ తేదీన కూడా 'జీరో షాడో డే' ఏర్పడుతుందని ఆయన వివరించారు. సమయంలో మార్పులతో దాదాపుగా అన్ని ప్రాంతాల్లోనూ నీడ మాయం అవుతుందని తెలిపారు. కాగా, ఇటీవల బెంగళూరులోనూ ఈ ఖగోళ అద్భుతం కనిపించిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 25న మధ్యాహ్నం 12.17 గంటల సమయంలో రెండు నిమిషాల పాటు ఎండలో ఉన్న వస్తువులు, మనుషుల నీడ మాయమైంది.

## నిఘా నీడలో ప్రవేశ పరీక్షలు..

హైదరాబాద్, మే3:టీ-ఎ స్పీఎస్సీ, పదో తరగతి పేపర్ లీకేజీల నేపథ్యంలో ఈ నెల నుంచి జరగనున్న వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఎంసెట్, ఎడ్‌సెట్, లాసెట్, ఐసెట్, పీజీ ఈసెట్, పీఈసెట్, ఈసెట్ పరీక్షల నిర్వహణపై తెలంగాణ ఉన్నత విద్యామండలి కీలక నిర్ణయం తీసుకుంది. పరీక్షల నిర్వహణ కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. ఈమేరకు

పరీక్షా కేంద్రాల్లో గట్టి నిఘాను ఏర్పాటు చేయనుంది. పేపర్ లీకేజీలు, ప్రశ్నపత్రాలు బయటికి రాకుండా ఉండేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే పరీక్షాకేంద్రాల్లో పూర్తిస్థాయి సిట్టింగ్ స్క్వాడ్‌ను (అబ్జర్వర్) నియమించాలని నిర్ణయించింది. ప్రతి పరీక్షా కేంద్రాల్లో ఒకరు చొప్పన సిట్టింగ్ స్క్వాడ్‌ను నియమించనుంది. వీరు పరీక్ష పూర్తయ్యే వరకు పరీక్షా కేంద్రాలపై గట్టి నిఘాను పెడతారు. గతంలో ఫ్లయింగ్ స్క్వాడ్‌ను నియమించేవారు. అయితే వీరు అడపాదడపా తనిఖీలు మాత్రమే నిర్వహించేవారు. కానీ ఈ విద్యాసంవత్సరం నుంచి అన్ని రకాల పరీక్షలు నిర్వహించి పరీక్షా కేంద్రంల్లో అబ్జర్వర్‌లను నియమిస్తారు. అంతేకాకుండా ఇక ప్రతీ పరీక్షా కేంద్రం వద్ద నలుగురు పోలీసుల బందోబస్తు తోపాటు, కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు- చేయనున్నారు. పరీక్షలు జరిగే సమయంలో ప్రశ్నపత్రాలు వాట్సాప్‌ల్లో చక్కర్లు కొడుతుండటంతో ఇక సెల్‌ఫోన్లను పరీక్షా కేంద్రాల్లో పూర్తిస్థాయిలో నిషేధించారు. పరీక్షా కేంద్రాలను నో సెల్‌ఫోన్ జోన్లుగా అమలుపరుస్తారు. విద్యార్థులు, ఇన్విజిలేటర్లు, పరీక్ష నిర్వహణ సిబ్బంది సహా అందరికి ఈ నిబంధన వర్తించనుంది. ఒక్క అబ్జర్వర్‌ను మాత్రమే సెల్‌ఫోన్‌తో అనుమతించినా గానీ పరీక్షా హాల్లోకి మాత్రం వీరు సెల్‌ఫోన్ తీసుకెళ్లడానికి అనుమతిలేదు. అది పరీక్ష మొదలైన 15 నిమిషాల వరకు మాత్రమే సెల్‌ఫోన్‌ను వాడేందుకు అనుమతిస్తారు. పరీక్షకు ఎంత మంది విద్యార్థులు హాజరయ్యారోనన్న సమాచారాన్ని ఉన్నతాధికారులకు చేరవేసేందుకు మాత్రమే 15 నిమిషాల వరకు అనుమతిస్తారు. ఎంసెట్‌తో పాటు- ఎడ్‌సెట్, లాసెట్, ఐసెట్, ఈసెట్, పీజీఈసెట్, పీఈసెట్‌లన్నింటిని ఇవ నిబంధనలు వర్తించనున్నాయి.

### ఒకే రోజు మూడు సెషన్లలో ఎడ్‌సెట్, లాసెట్

ఇక లాసెట్, ఎడ్‌సెట్ పరీక్షలు ఒకే రోజు మూడు సెషన్లలో నిర్వహిం చనున్నారు. మిగిలిన సెట్‌లను రెండు సెషన్ల చొప్పున పూర్తి చేయనున్నారు. ఎడ్‌సెట్ ఈనెల 18న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మొత్తం మూడు షిఫ్టుల్లో, లాసెట్‌ను ఈనెల 25న ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మూడు షిఫ్టుల్లో నిర్వహించనున్నారు. ఎంసెట్, ఈసెట్, ఐసెట్, పీజీఈసెట్ పరీక్షలను మాత్రం రెండు సెషన్లలో పూర్తి చేయనున్నారు.

### ఆలస్యమైతే అనుమతిలేదు: ప్రొ.ఆర్.లింబాద్రి, ఉన్నత విద్యామండలి చైర్మన్

ఆలస్యమైతే పరీక్ష కేంద్రాల్లో అనుమతించబోమని ఉన్నత విద్యామం దలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబ్రాది తెలిపారు. మాసాబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంసెట్‌కు ఈ ఏడాది అదనంగా 50వేల దరఖాస్తులొచ్చాయన్నారు. ఇప్పటికే 2.5లక్షలకు పైగా విద్యార్థులు హాల్ టికెట్లు- డౌన్‌లోడ్ చేసుకున్నారని తెలిపారు. ఈ నెల 10 నుంచి 14 వరకు ఎంసెట్ అగ్రికల్చర్, ఇంజినీరింగ్ పరీక్షలు జరగనున్నాయి. ఈ నెల 10, 11 తేదీల్లో అగ్రికల్చర్, ఈ నెల 12, 13, 14 తేదీల్లో ఇంజినీరింగ్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ సంవత్సరం ఎంసెట్‌కు భారీగా దరఖాస్తులొచ్చిన నేపథ్యంలో కొత్తగా 28 పరీక్షాకేంద్రా లను ఏర్పాటు- చేశామన్నారు. గతేడాది 2.66 లక్షల దరఖాస్తులు కాగా, ఈ ఏడాది 3.20 లక్షల దరఖాస్తులొచ్చాన్నారు. ఈ సంవత్సరం అగ్రికల్చర్, మెడికల్‌కు 113, ఇంజినీరింగ్‌కు 137 పరీక్షా కేంద్రాల ను ఏర్పాటు- చేశామన్నారు. ఇక ఎంసెట్ దరకాస్తు స్వీకరణ మంగళవారం అర్ధరాత్రితో ముగియనుండగా, దరఖాస్తుల సంఖ్య స్వల్పంగా పెరగనుంది. విద్యార్థులు నిర్ణీత సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, ఆలస్యమైతే అనుమతించేది లేదని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థులు -టె-న్షన్‌కు గురికాకుండా ప్రశాంతం గా పరీక్షలకు హాజరుకావాలన్నారు. ఈ సమావేశంలో జేఎఎన్టీయూ వీసీ ప్రొఫెసర్ కట్టా నర్సింహారెడ్డి, ఉన్నత విద్యామండలి కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌రావు, ఎంసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ డీన్‌కుమార్, కో కన్వీనర్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్‌రెడ్డి, ఈసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్, పీజీఈసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ రవీంద్రారెడ్డి, లాసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ విజయలక్ష్మీ, ఎడ్‌సెడ్ కో కన్వీనర్ ప్రొఫెసర్ పారుపల్లి శంకర్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## 24 గంటల్లో 3,720 కొత్త కేసులు.. 20 మరణాలు

న్యూఢిల్లీ, మే3: దేశంలో కరోనా వైరస్ వ్యాప్తి కొనసాగుతోంది. రోజూ వేలల్లో కొత్త కేసులు నమోదవుతున్నాయి. తాజాగా గత 24 గంటల వ్యవధిలో 3 వేలకు పైనే కొత్త కేసులు వెలుగుచూశాయి. కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి బుధవారం ఉదయం 8 గంటల వరకు 1,50,735 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు చేయగా.. 3,720 కొత్త కేసులు బయటపడ్డాయి. తాజా కేసులతో మొత్తం కరోనా బారిన పడిన వారి సంఖ్య 4,49,56,716కి చేరింది.

ప్రస్తుతం దేశంలో 40,177 కేసులు యాక్టివ్ గా ఉన్నాయి. ఇప్పటి వరకు మహమ్మారి నుంచి 4,43,84,955 మంది కోలుకున్నారు. ఇక గత 24 గంటల వ్యవధిలో 20 మంది ప్రాణాలు కోల్పోగా.. మొత్తం కొవిడ్ మరణాల సంఖ్య 5,31,584కి చేరింది.

ఇక ఇప్పటి వరకు నమోదైన పాజిటివ్ కేసుల్లో 0.09 శాతం మాత్రమే యాక్టివ్‌గా ఉన్నట్లు కేంద్రం వెల్లడించింది. రికవరీ రేటు 98.73 శాతంగా, మరణాల రేటు 1.18 శాతంగా ఉన్నట్లు పేర్కొంది. ఇప్పటి వరకు 220.66 కోట్ల (220, 66, 71,072 ) కరోనా వ్యాక్సిన్ డోసులు పంపిణీ చేసినట్లు కేంద్రం వెల్లడించింది.

## వీసీఎమ్మెస్ ఆధ్వర్యంలో ఘనంగా శ్రీ వాసవి మాత జయంతి ఉత్సవాలు



హైదరాబాద్, మే3:సింగపూర్‌లోని చైనాటౌన్‌లో ఉన్న మారియమ్మన్ ఆలయంలోని శ్రీ వాసవి మాత జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. వాసవి క్లబ్ మెర్లయన్ సింగపూర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సంబురాల్లో సింగపూర్ ఆర్యవైశ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వాసవి జయంతితోపాటు వీసీఎమ్మెస్ పదో వార్షికోత్సవ వేడుకలను కూడా నిర్వహించారు. ఈ నేపథ్యంలో సుమారు ఎనిమిది గంటల పాటు నిర్విఘ్నంగా జరిగిన పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో సుమారు 350 మందికి పైగా ఆర్య వైశ్యులు పాల్గొని తమ శ్రద్ధ, భక్తి ప్రపత్తులను చాటి చెప్పారు. ఈ సందర్భంగా అమ్మవారికి కుంకుమార్చన, అలంకార పూజ, రథయాత్ర మొదలైన ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. వీసీఎమ్మెస్ కార్యనిర్వాహక బృందానికి చెందిన నాగరాజ్ కైల, శ్రీధర్ మంచికంటి మాట్లాడుతూ అతి కొద్దిమంది ఆర్యవైశ్యులతో చిన్న సంస్థగా ప్రస్థానాన్ని ప్రారంభించిన వీసీఎమ్మెస్.. ఈ పదేండ్లలో ఒక వటవృక్షంగా ఎదగటం ఆనందించదగిన విషయమని చెప్పారు. దీని వెనక ఎందరో సింగపూర్ ఆర్యవైశ్యుల అంకితభావం, కృషి ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా పాల్గొన్న బొబ్బ శ్రీనివాస్‌కు ధన్యవాదాలు తెలిపారు.

అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఇందులోభాగంగా 'గణానాం త్వ గణపతిం' అంటూ కారె సాయి కౌశల్ గుప్త చేసిన గణపతి ప్రార్థనతో కార్యక్రమాలు మొదలయ్యాయి. శిల్పా రాజేష్ సారథ్యంలో కోలాట నృత్య ప్రదర్శన బృందం వేదికపై వాసవి మాతకు కోలాటంతో వందనాలు సమర్పించారు. సింగపూర్‌లో మొదటిసారిగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జీవిత చరిత్రను నాటక రూపంలో ప్రదర్శించారు. అంతేగాక యువ కళాకారులు అక్షరశెట్టి మాడిచెట్టి, ముక్తిథ మేడం, ఉమా మోనిష నంబూరి ల భరతనాట్య ప్రదర్శనలు, తన్వి మాదారపు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఆనంద్ గంధే, కిరణ్ కుమార్ అప్పన, కొండేటి ఈశాన్ కృష్ణ తమ గాత్ర ప్రతిభతో శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు. సాయంత్రం అమ్మవారికి జరిపిన కుంకుమార్చన అలంకార పూజ పిదప జరిగిన రథయాత్రలో భాగంగా శ్రీమతి గాదంశెట్టి నాగ సింధు గారి నేతృత్వంలో 16 మంది తరుణీమణులు చేసిన మరొక కోలాటం వచ్చే ప్రదర్శన కూడా అందరినీ ఎంతో ఆకట్టుకుంది.

ఇదే సందర్భంగా వీసీఎమ్మెస్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ప్రెసిడెంట్‌గా మురళీకృష్ణ పబ్బతి, సెక్రటరీగా సుమన్ రాయల, కోశాధికారిగా ఆనంద్ గంధే, మహిళా అధ్యక్షురాలిగా సరిత విశ్వనాథన్ ను ఆహూతులకు పరిచయం చేశారు. ఆ తరువాత సంస్థ అభివృద్ధికి కృషిచేసిన నరేంద్ర కుమార్ నారంశెట్టిని ఘనంగా సత్కరించారు. ఈ సాంస్కృతిక కార్యక్రమాలకు సంధానకర్తగా ఆత్మూరి వెంకట రామ ఫణేష్, సహవ్యాఖ్యాతగా వాసవి ఫణేష్ ఆత్మూరి వ్యవహరించారు. ఈ కార్యక్రమం విజయవంతమవడానికి కృషిచేసిన అందరికీ మురళీకృష్ణ పబ్బతి కృతజ్ఞతలు తెలిపారు.

## మే 6,7న 'శ్రీ వేంకటేశ తాపిన్యుపనిషత్' అంశంపై బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మగారి ప్రసంగం

ప్రముఖ ఉపాసకులు వేద వేదాంత విషయ సమన్వయ చక్రవర్తి 'బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ" గారు అనేక మార్లు ఉపన్యాసములు ఇచ్చి ప్రజలలో భక్తిని పెంపొందిస్తున్నారు. ఇదే పద్ధతిలో శ్రీ శర్మగారు "శ్రీ వేంకటేశ తాపిన్యుపనిషత్" అనే అంశంపై హైదరాబాద్‌లో కుషాయిగూడలోని శ్రీ పద్మావతి వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణమునందు మే 6,7 తేదీలలో సాయంత్రం 6.30 నుండి 8.30 వరకు ప్రవచనాలు ఉపన్యాస పరంపర చేయనున్నారు.

"శ్రీ వేంకటేశ తాపిన్యుపనిషత్"లోని అంశాలు భక్తి పూరితమైనవే గాక ఆధ్యాత్మికోన్నతికి తోడ్పడతాయని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనవలసిందిగా మనవి.

- భక్త బృందం




నేటి కందం- నేటికి అందం

కం॥ అనయము బాధల గుంర్చెడి
యనలము తో పోరు సలుపు ఆత్మీయు లతిన్
వినుతించు దినమటంచును
మనమున స్మరియింతు 'నగ్నిమాపకదినమున్'!!

(మే 4 అగ్ని మాపక దినోత్సవం
Fire Fighters Day..)



-రాధశ్రీ
సెల్:9494481210

## ధైర్యమనే ఉష్ణబంధక కవచాన్ని ధరించిన యోధులు..!

(డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి)

తమ ప్రాణాలను ఫణంగా పెట్టి ధైర్యమనే ఉష్ణబంధక కవచం తొడుక్కొని మంటలను ఆర్పుతూ ప్రజలనే కాకుండా వారి ఆస్తిపాస్తులను కూడా కాపాడే మహత్తర విధులను నిర్వహించే అగ్నిమాపకదళ సైనికులకు మనస్పూర్తిగా కృతజ్ఞతలు తెలియజేయాలనే సంకల్పంతో జె జె ఎడ్మండ్‌సన్ స్థాపించిన 'అంతర్జాతీయ అగ్నిమాపకదళ దినోత్సవాన్ని' ప్రతి ఏటా 04 మే రోజున ప్రపంచదేశాలు నిర్వహిస్తున్నాయి. 04 జనవరి 1999న ఆస్ట్రేలియాలోని విక్టోరియా అడవుల్లో మంటలను ఆర్పే క్రమంలో ఐదుగురు అగ్నిమాపక సిబ్బంది ప్రాణాలు కోల్పోవడంతో వారి అద్వితీయ సేవలకు గుర్తుగా 04 మే రోజున ఈ దినోత్సవం పాటిస్తున్నారు.

### సేయింట్ ఫ్లోరియన్స్ స్మారక దినం:

ప్రపంచ తొలి రోమన్ బటాలియన్ అగ్నిమాపకదళ కమాండర్‌గా సేవలు అందించిన సేయింట్ ఫ్లోరియన్ స్మారకార్థం ఈ రోజున 'సేయింట్ ఫ్లోరియన్స్ డే'గా కూడా పాటించబడుతున్నది. పట్టణ, గ్రామ, పర్యావరణ, రక్షణరంగ, పారిశ్రామిక, ఏవియేషన్, మోటార్ స్పోర్ట్స్ రంగాల్లో అగ్నిమాపకదళం ఎల్లవేళల సిద్ధంగా ఉంటూ ఎనలేని మానవీయ సేవలను చేస్తూ మానవాళి మనసులు దోచుకుంటున్నారు. మంటలను ఏకైక శత్రువులుగా భావించి ఆవాసాలు, అడవులు, పరిశ్రమలు, కార్యాలయాలు, సంస్థలను మంటల నుంచి కాపాడటమే లక్ష్యంగా నిస్వార్థ సేవలను అందించే అగ్నిమాపక దళానికి మనందరం రుణపడి ఉండాలి.

### సుశిక్షిత అగ్నిమాపక దళం:

మంటల్ని ఆర్పే మహాయజ్ఞంలో గాయపడిన క్షతగాత్రులకు సంఘీభావాన్ని తెలపడం, అమరుల వీరులకు నివాళులు అర్పించడం మన కనీస కర్తవ్యం. దేశ మానవ వనరులను, ఆస్తులను దగ్ధం కాకుండా కాపాడేందుకు మంటల్లోకి దూకి, మంటలతో పోరాడి, మంటలను మట్టి కరిపించి, సమాజహితానికి పాటుపడే దేశభక్తులుగా అగ్నిమాపకదళ సిబ్బంది మన ముందు ఆదర్శంగా నిలుస్తున్నారు.

### 4 మే 'అంతర్జాతీయ అగ్నిమాపక దళ దినం' సందర్భంగా...

అగ్నికి సమయం, సందర్భం, విచక్షణ ఉండదు. సుశిక్షితులైన అగ్నిమాపకదళం మాత్రం ఎల్లవేళల సిద్ధంగా ఉంటూ, ఒక్క ఫోన్ కాల్‌తో నిమిషాల్లో అగ్ని ప్రమాద స్థలానికి కావలసిన అగ్నిమాపక పరికరాలతో చేరుతుంది. అంతర్జాతీయ అగ్నిమాపకదళ దినం రోజున సిబ్బంది, సామాన్య జనం నీలి (జల సంకేతం), ఎరుపు రంగు (మంటలకు సంకేతం) రిబ్బన్లను ధరించి అగ్నితో పోరులో అమరులకు శ్రద్ధాంజలి, కుటుంబ సభ్యులకు సంఘీభావం, క్షతగాత్రులకు ప్రగాఢ సానుభూతి ప్రదర్శించాలి. సాధారణ ంగా మే మాసపు తొలి ఆదివారం రోజున మధ్యాహ్నం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన సిబ్బంది మనశ్శాంతికి కొన్ని నిమిషాలు నిశ్శబ్దం పాటించే ఆచారం కూడా పాటించడం జరుగుతుంది.

### అగ్నిమాపక దళాల కొరతలో భారతం:

భారతదేశ జనాభా ఆధారంగా 8,559 అగ్నిమాపక కేంద్రాల అవసరం ఉండగా, ప్రస్తుతం 2,987 కేంద్రాలు మాత్రమే సేవలు అందిస్తున్నాయి.సాధారణ ప్రజలకు అత్యవసర సేవలు అందించడానికి నేషనల్ ఎమర్జెన్సీ ఫోన్ నెంబర్ 112, ఫైర్ 101, పోలీస్ 100, అంబులెన్స్ 102, ప్రకృతి విపత్తులు 108 టోల్ ఫ్రీ నెంబర్లు ప్రతి క్షణం అందుబాటులో ఉన్నాయి. అగ్నిమాపకదళంలో ప్రమాదకర పదార్థాల నిపుణులు, మంటలను ఆర్పే విభాగం, తాత్కాలిక అగ్నిమాపక సభ్యులు, స్వచ్ఛంధ కార్యకర్తలు, కార్చిచ్చు ఆర్పే విభాగం, భారీ పరికరాల నియంత్రణ చేసే విభాగం, అత్యవసర వైద్య విభాగం లాంటి పలు విభాగాల సభ్యులు ఉంటారు. దేశం, ప్రాంతం, వర్గం, మతం, కులం, భాష లాంటి భేదాలు లేకుండా అగ్నిమాపకదళం అనితరసాధ్య సేవలను అంకితభావం, త్యాగం, నిబద్ధత వంటి సూత్రాలను శ్వాసిస్తూ, మానవాళికి అనన్య సామాన్య సేవలు అందిస్తున్నారు.

నేటి ఆధునిక యుగంలో అమెజాన్, ఆస్ట్రేలియా అడవుల్లో తరుచుగా సంభవించే కార్చిచ్చులు అగ్నిమాపకదళానికే కాకుండా ప్రభుత్వాలకు కూడా పెను సవాళుగా నిలుస్తూ, పర్యావరణానికి తీవ్ర విఘాతాన్ని కలిగిస్తున్నాయి. అడవుల్లో చెలరేగే కార్చిచ్చులో మానవాళి, ఆవాసాలు, ఆస్తులతో పాటు అమూల్య వణ్యప్రాణులు, హరితవనాలు, వన సంపదలను కూడా కాపాడటంలో అగ్నిమాపక యోధుల పాత్ర అనిర్వచనీయం. అగ్నిమాపకదళ సభ్యుల అద్వితీయ సేవలను మానవ సమాజం మరువకుండా, సర్వదా కృతజ్ఞతా పూర్వ కంగా అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేద్దాం.

## హైదరాబాద్ లో గోనెసంచిలో మహిళ మృతదేహం..

హైదరాబాద్, మే3: హైదరాబాద్ నగరంలోని కూకట్‌పల్లిలో గోనెసంచిలో మహిళ మృతదేహం కలకలం రేపుతోంది. కూకట్ పల్లి నుండి మూసాపేట రైల్వే రోడ్డు వైపే వెళ్లే మార్గంలో గోనెసంచిలో మహిళ మృతదేహం కన్పించింది. స్థానికంగా పిల్లలు క్రికెట్ ఆడుతుండగా బాల్ కోసం అక్కడికి వచ్చారు.

అయితే గోనె సంచి నుండి కాలు బయటకు కన్పించింది. దీంతో భయపడిన పిల్లలు స్థానికులకు సమాచారం ఇచ్చారు. స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి చేరుకుని గోనెసంచిలోని మహిళ డెడ్ బాడీని ఆసుపత్రికి తరలించారు. గోనెసంచిలో ఉన్న మహిళ డెడ్ బాడీ ఎవరిదనే దానిపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మృతి చెందిన మహిళ వయస్సు 30-35 ఏళ్ల వయస్సు ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.




నేటినిజం
# సాహితీ కెరటాలు
website:www.netinijam.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 4-5-2023

## నానీలు

బట్టలు తెలుపు
మనస్సు నలుపు
రాజకీయ నేతల
రాక్షస క్రీడలు!

విజ్ఞానం రెక్కలు
విరిచేసావా
అజ్ఞాన అగాథంలోకి
మనిషి జీవితం!

మనిషితనమే
కరువైన చోట
మానవత్వం
మంటల్లో బూడిద

ఉమ్మడి కుటుంబం
సమూహగీతం
నేనూ భార్యా పిల్లలు
స్వార్థ శిఖరం.

నా కలం
మూగనోము పట్టింది
కొత్త భావాల సిరా
నింపాల్సిందే



-ఎన్. లహరి
9885535506

## ఘంటారావం

చెప్పుడె మాటలు
చేటు
తప్పుడు బాటలు
వేటు.

సామర్థ్యం లేకుంటే
సమాజాన్ని శపిస్తావా?
చేంతాడు సరిపోకుంటే
చేదబావి పూడుస్తావా?

కోపం తగ్గితే
పాపం పారిపోతుంది
దీపం వెలిగితే
తిమిరం తరిగిపోతుంది



-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

పుస్తక సమీక్ష

# సుమ పరిమళాలు గునుగు పూలు






మనలోని భావాలకు ఆలోచన శక్తికి రెక్కలు వచ్చినప్పుడు అవి ఆకాశంలో ఎగరడానికి ఇష్టపడతాయి అంతరాంతరాలలో సునామీలు పుట్టినప్పుడు భూమి పొరల్లో అలజడులు రేగినప్పుడు మనసు కన్నీరు కారుస్తుంది. భావాలు, హృద్యంగా రెక్కలొచ్చిన పక్షులు అవుతాయి. సమాజం నా కుటుంబం అనుకున్నప్పుడు సంఘంలోని సమస్యల పరిష్కారానికై వెతుకుతున్నప్పుడు కనులు తెలియకుండానే భావాలను వ్యక్త పరుస్తాయి. ఆ సమయంలో కలంలోంచి జాలువారేదే కవిత్వమై చరిత్రలో నిలిచిపో తుంది. మనిషి ఆవిష్కరించిన గొప్ప సృష్టి ఈ కవిత్వం. ఈనాడు ఉన్న పరిస్థితులను బట్టి అనేకమంది కవులు కవయిత్రులు, తమ తమ కలములకు నడిచే కాలం తెచ్చి రాణింప చేస్తున్నారు. అలాంటి వారిలో ఉదయించే భానునిలా ఉదయశ్రీ ప్రకృతి పట్ల ఎనలేని అభిమానం కలిగి సుమ పరిమళాలను తన కలం ద్వారా వెదజల్లుతున్నారు ఉదయశ్రీ ప్రభాకర్ మంచి రచయిత్రి సున్నితమైన హృదయం కలిగి విశాల భావాలతో ప్రకృతిలో ప్రతి అణువును తన ఆలోచన దృక్పథంతో తనదైన శైలిలో వర్ణిస్తారు.

సౌమ్య స్వభావం కలిగిన వీరు చురుకుదనంతో చురకత్తిలాంటి సూటైన పదాలతో ప్రతి కవితలు కొత్తదనంతో తన రచన కొనసాగుతుంది. ప్రకృతిలో మనం ఒక భాగం కానీ ప్రకృతి అంతా నాదే అని దాని వినాశనం కోరే వారికి కనువిప్పుగా తన మొదటి కవిత మార్పు అనివార్యం లో అవని గుండె ముక్కలు అయింది. అని ఆవేదన వ్యక్తపరుస్తూ మార్పు అనివార్యం అని బోధిస్తారు. ఈ ప్రకృతిలో ప్రకృతితో చెలిమి చేద్దామంటారు. ఇది వారి ఆశావాహ దృష్టికి తార్కాణం. ఇక అపార్ట్మెంట్ కల్చర్ను గూర్చి అంతరాలను చెరిపేసే అంతస్తులు అని రాయడం వెనక ఎంతో అంతరార్థం దాగి ఉంది.

మనుషులు సంకుచిత భావాలతో ఉమ్మడి కుటుంబాలుగా ఉన్న బంధాల కంటే దూరంగా ఉండి ఒంటరి జీవితానికి ఇష్టపడుతున్నారని దానివలన ఏం కోల్పోతున్నారు తెలియలేని దుస్థితిలో ఉన్నారని గుర్తు చేస్తారు.

ఉదయశ్రీ కేవలం నేటి పరిస్థితులే గాక మన సంస్కృతి సంప్రదాయాల పట్ల మంచి అభిమానం కలిగి ఉన్నారని అనుటకు నిదర్శనం తులసి చెట్టు అన్న కవిత ఇందులో సామాన్య శాస్త్రం ప్రకారం కూడా మన ఆయువును పెంచే శక్తి ఈ తులసికి ఉందని అందరికీ తెలియజేస్తారు వెలకట్టలేని శ్రమ అను కవితలో బాధ్యత కోసం భార్య తన పుట్టిల్లు వదిలి అత్తారింట్లో అవస్థలు పడుతూ కేవలం రాలే మెప్పుల పుప్పొడి కోసం ఎంతో ఎదురుచూస్తూ కుటుంబానికి అంకితం అవుతారు అని ఈనాటి స్త్రీ అనాది నుండి ఈనాటి వరకు ఎంతో కష్టపడుతోందని ఇప్పటికీ తనకు గుర్తింపు రాలేదని చెప్పకనే చెబుతారు. ఇక పుస్తక విషయానికి వస్తే పూలు తమ జీవితం క్షణకాలమైనా వికసించి నవ్వులు పంచి వాడిపోతాయి అటువంటి పూలు మనకు ఆదర్శం మరి "పూల జాతర"అను కవితలో కవయిత్రి అనేక పూలను వల్లే వేస్తూ రంగు తానాలు చేసిన గునుగు పూలు అంటారు ఎంతటి భావ చిత్రనా చాలా బాగుంది. దీనిలోని నిగూఢార్థం గునుగు పూలను బతుకమ్మ పండుగకు అనేక రంగులలో ముంచుతారు చాలా విచిత్రంగా అనిపిస్తుంది కదూ! తెల్ల రంగ అయినా ఆ పూలు రంగురంగులుగా మారి అందరి హృదయాలలో అల్లుకుపోతాయి అందుకే కవయిత్రి తాను జీవితాన్ని వడపోసిన అనుభవాలతో మన జీవనం కేవలం ఒకే రంగుతో అంతమయ్యేది కాదు రకరకాల కష్టసుఖాల రంగులు పులుముకొని జీవన నాటక రంగంలో చిరునవ్వులు చిందించి చివరకు బతుకమ్మ ప్రపంచపు ఆటలో తలలో నాలుకై చివరకు చెరువులో కలిసిపోవాలని అర్థంలో పుస్తకానికి గునుగు పూలు అనే చక్కటి నామధేయంతో సార్థకతను చేకూర్చాలనిపిస్తుంది ఉదయశ్రీ మన పలకం ఝరీ ప్రవాహం వలె పల్లె అందాలను స్పృశిస్తాయి. రగిలే అగ్నిశిఖలవుతాయి అమ్మానాన్నల ఆటలవుతాయి నిన్ను నీవు తెలుసుకో అంటాయి అంతేకాదు సమాజంలోని స్త్రీలు రైతులు స్వేచ్ఛను కోరుకుంటున్నారు అని చాటి చెబుతాయి అడవి మల్లెలు మనతో మాట్లాడుతాయి దూది పూల దుఃఖాన్ని తెలుపుతాయి మనుషులలోని మాలిన్యం తొలగి అజ్ఞానపు చీకట్లు పారద్రోలితే కనుమరుగు కానీ వారసులు ప్రేమ సంతకం చేసి జీవన ప్రవాహం ఒక మంచినీటి నదిలా సాగుతుంది అని తన రచనల ద్వారా మంచు జల్లులు కురిపిస్తారు.

ఈ గునుగు పూల పుస్తకం లో వజ్రాయుధం వంటి ఈ కైతల ద్వారా రచయిత్రి ఉదయశ్రీ ఈ సంపుటిలో 51 కవితలను మార్పు అనివార్యం నుండి వయోధికులు వరకు తనలోని భావాల పరంపరలను తీయనైన పదునైన మాటలతో మందలిస్తూ పలుకరిస్తూ పులకింపజేస్తూ చురకలు పెడుతూ చుక్కల్లా మెరుస్తూ మురిపిస్తూ రాస్తారు. ఇది వారి మేధోశక్తికి చైతన్యానికి మచ్చుతునక. ఉదయశ్రీ కవిత్వం మూడు పూలు ఆరు కాయలుగా వికసించాలని గునుగు పూల నుండి సువర్ణ పుష్పాలై పారిజాత పరిమళాలై ప్రపంచమంతా వెదజల్లబడాలని ఇంకా అనేక ఉత్తమ రచనలు వారి కలం నుండి ప్రవాహ వెల్లువలై జాలువారాలని వీరు ఉన్నత శిఖరాలు అందుకోవాలని ఆశిస్తూ ...

**ప్రతులకు:** ఉదయశ్రీ ప్రభాకర్
సెల్: 9866687134



-ఆర్.ఎన్. ఉమాదేవి.
సెల్: 9701046273

## శ్రమకో దండం

శ్రమించే చేతులకో భాష ఉంటుంది
పదకోశముంటుంది
పలుకుల్లో భావ సంపద ఉంటుంది
చేతుల నుంచి రాలిపడే శ్రమ బిందువులుంటాయి
చిక్కనైన మనసొప్పిన పాటలుంటాయి.

చెవుడు కాని చెవులకు వినిపించే
సుస్వరాల సంగీత ధ్వనులుంటాయి
కురిసే వాన చినుకుల్ని
చేదుకునే చేతులుంటాయి
పండించే సకల పంటలుంటాయి.

శ్రమించే చేతులు
అన్నాన్ని సృష్టిస్తాయి
లోకం ఆకలి తీర్చే సత్తా వాటికుంటుంది
శ్రమించే చేతులే నాగరికతకు హేతువు
ప్రపంచానికి అందమూ ఐశ్వర్యమూ..

చేతుల్లో శిలని శిల్పంగా మలిచే కళ ఉంటుంది
చేతుల్లో ప్రకృతి పరిరక్షణ ఉంటుంది.

శ్రమైక సౌందర్యాన్ని చిన్నచూపు చూడొద్దు
కూర్చుని అనుభవించే సోమరిపోతులు మోసగాళ్లు
మీకు శ్రమేదిక్కు.. అధికారం మాత్రం తగదంటారు.

నేను శ్రమని గౌరవిస్తాను ప్రేమిస్తాను.
శ్రమించే చేతుల కోదండం!
శ్రామికజనం లేని
సమాజాన్ని ఊహించతరమా?!



-డా॥ దామెర రాములు
సెల్:9866422494

## కాదేది రాజకీయానికనర్హం

ఓటుచుట్టూ అన్నీ
ఆలోచన ఆవేదన ఆలాపనలన్నీ

ఏ రాగం ఎత్తుకున్నా
ఏ కుతంత్రం అమలు చేసినా
ఏ ప్రయత్నం మొదలుపెట్టినా
ఓటే.... నాలుకపై
వాగ్దానమై ఓటే,

ఓటు తెచ్చే గెలుపే....

ఓటంటే చైతన్యం
చైతన్యంతో దోబూచులాట
మనసుకు తెలియని గారడీ ఆట
రాక్షస ఆటల సమర్ధనల పాట–

ఓటు విలువ ఎంతో గొప్పది
మనసులపై ఎన్నికల దాడి
మతాల కుంపట్లలో
మతలబుల దారి ఓటే......

ఓటు నీది నాది కాదు
ఆలోచనకు ఆవేశానికి
జరిగే సంఘర్షణది.

ఓటు నీది నాది కాదు
సున్నిత భావాల మంటలతో
చలి కాచుకునే స్వార్థ రాజకీయానిది.

దిగజారిన రాజకీయానికి
ప్రతిదీ వస్తువే.....
రెచ్చగొట్టే వ్యాఖ్యల చూపులకు
ఓటర్లంతా అప్పనంగా
పుట్టుకొచ్చే ఆస్తులే.......

నాయకుడా.....
ఎన్ని విద్యలు నేర్చావు
ఎన్నికలు వచ్చాయంటే
సమాజపు మనసు పలకలపై
ఎన్ని భిన్న రాతలు రాస్తావు
కూడిక నష్టమేనని
తీసివేతలు విడదీస్తుంటావు
లెక్కలు తెలియని జనాల
మనసుకు కొత్త కథలను చెబుతావు.

ఓటరు మనసంటే నీకు
ప్రయోగశాల గది–

ఎన్ని ప్రయోగాలు చేస్తావు
ఎన్ని రంగులు మార్చేస్తుంటావు

ఎన్ని పొగలను తెప్పిస్తావు
విజయం కోసం ఎన్ని
రసాయనాలకు ప్రాణం ఊదుతావు.

రసాయన చర్యలు చూసి
ఎంత ఆనంద పడతావు–

నాయకుడా
ఎంత దిగజారి పోయావు
ఓటు కోసం సీటు కోసం
అవసరానికో వేషం వేస్తావు
అబద్ధాలను నిజం చేయుటకు
సమాజ దేవత కళ్లను కప్పి
ఓట్ల మెరుపుకై వీక్షిస్తుంటావు.

అగ్గిపుల్లా సబ్బు బిళ్ళ
కవితకు కాదేది అనర్హం
మాటల యుద్ధం మూటల తంత్రం
మతాల బూజు చరిత్రల రివాజు
రాజకీయానికి కాదేది అనర్హం.



-సిరిసిల్లా గఫూర్
శిక్షక్,
9849062038

పుస్తక సమీక్ష

# నానా రుచిరార సూక్తి. ప్రసన్నకధా కలితార్థయుక్తి






ఒకసారి చూడండి. అంతే! వాట్సప్ గ్రూపు సృష్టికర్త శ్రీ సుధామ. అసలు పేరు అల్లంరాజు వెంకట రావు. కవి, కార్టూనిస్టు, కాలమిస్టు, సమీక్షకులు పదహేళిక నిర్మాత, వక్త, ఆకాశవాణి విశ్రాంత కార్యక్రమ నిర్వహణాధికారి. పదివిలో ఉన్నా, రిటయిరయినా, 'టైయిరు' అవకుండా, సాహిత్య సేవ చేస్తున్న సాహితీ కోహినూరు.

గ్రూపు ప్రారంభించి రెండేళ్ళయింది. రెండు వేల మంది ఆంధ్ర భాషానురక్తులు సభ్యులు. దృశ్య శ్రవణ పఠన సమ్మిళిత ప్రసార సంచిక. శ్రేష్టమైన, ఆరోగ్యకరమైన సాహిత్యాన్ని తెలుగు వారి కందిస్తున్నారు. అంతర్జాల మీడియాలో ఇదొక గొప్ప ప్రయోగం అనవచ్చును. శ్రీ విహారి మల్లాది వంటి సాహితీ దిగ్గంతుల చేయుతతో దిన దిన ప్రవర్ధమామవుతోన్న ప్రసార సంచిక. ఇదో వినోత్న యత్నం. గొప్పవారి ఆలోచనలు, అమలు పరచటాలు ఎప్పుడూ గొప్పగానే ఉంటాయన్న సామెత సాకారం.

వారి హితురాలు, స్నేహితురాలు, డా॥ దుర్గా లక్ష్మీ ప్రసన్న స్మారక శోభకృతు ఉగాది కథల పోటీ నిర్వహించారు. అభిమానులు ఉత్సాహంతో స్పందించారు. కథల వెల్లువ విశాఖ సంద్రమయింది. అతి తక్కువ సమయం. అయినా రెండు వందల కథలతో తమ అభిమానాన్ని చాటుకున్నారు. సీనియర్ మోస్ట్ రచయిత శ్రీ ద్విభాష్యం రాజేశ్వర రావుగారు న్యాయ నిర్ణేతగా వ్యవహరించి, గోప్యత పాటించి, ఓ పది కథలను 'బహుమతి కథలు'గా నిర్ణయించారు. మరో 15 కథలను కూడా **'ఎన్నుకుని'** ప్రసన్న భారతి కథా మంజరి కథల సంకలనంగా వెలువరిస్తున్నారు. అందమైన అరవింద దళాయతాక్షి, పద్మకేసర వర్ణిని, పద్మాన్ని ఆసనంగా చేసికున్న సరస్వతి, ముఖ చిత్రంతో అలరారే ఈ కథా సంకలనం సాహితీ ప్రియులందరినీ అలరిస్తుంది.

'మంజరి' అన్న సంస్కృత మూలం కల ఈ పదానికి అర్థం– చివురించిన లేత కొమ్మ అని పూగుత్తి అని. సమర్థమైన ఆధునిక, సంతోషం కలిగించే, శ్రద్ధగల సృజనాత్మకమైన అని కూడా మరిన్ని 'అర్థాలున్నాయి.

'కథా మంజరి'లోని కథలన్నీ పరశీలిస్తే, శ్రద్ధగా చదివితే, పై అర్థాలకు ఈ సంకలనం సార్థకత చేకూర్చిందనే చెప్పవచ్చును. 'గంధకుటి' వారు ప్రచురించిన ఈ పూగుత్తిలో జీవితంలోని అన్ని రంగులు కనిపిస్తాయి. అప్పుడప్పుడే రాయటం మొదలెట్టిన చిగురుటాకు నుండి పండు తమలపాకు వంటి పరిణతి చెంఇన రచయిత(త్రు)లున్నారు.

సమాజహితాన్ని కోరే ఈ కథల్లో అవసరానికి ఆదుకోవాలన్న మానవత్వం చూపాల్సిన కరుణరసం ఉంది (చింతా జలది–శ్రీధర) ఆశయ సాధనకు చేతిసాయం అందించాలి అన్న సత్చింతన ఉంది. (లక్ష్యం కద జాస్తి –రమాదేవి) చనిపోతానని ముందే తెలిస్తే ప్రకటించాల్సింది నిబ్బరం. అయోమయం కాదు (ఆలంబన–గోర్తి వాణీ శ్రీనివాస్) కులాలు మతాలు వర్ణాలకంటే చిత్తశుద్ధి ఉన్న మనసుతో అవసరానికి ఆదుకోవాలన్న హితవు ఉంది (పరమం పవిత్రం–వై. ఉషాకిరణ్) పంకంలో పద్మం విరబూస్తే, అభినందించాల్సింది పద్మాన్ని పం కాన్ని ఈసడించుకోవటం కాదు (జీవన వేదం–శ్రీనివాసరావు తిరుక్కోవుళ్ళూరు) సమాజంలో సంఘటిత శక్తే మానవ ధర్మం ఈ ధర్మమే మనిషిని మానసును వేరుచేస్తుంది (మాబడి మర్రి చెట్టు నీడన– తెన్నేటి శ్యామకృష్ణ) పెళ్ళి చూపుల్లో అమ్మాయికి నిబ్బరంఉందో లేదో పరిక్షించటం తప్పు కాదు. అది e–తరం లక్ష్యం కావాలి (e–తరం జీవి శ్రీనివాస్). ఆడది అబల నిజమే! కాని కష్టం వచ్చినపుడు 'బేరు'' మనకూడదు. కష్టాన్ని ఎదుర్కునే ఆత్మస్థయిర్యాన్ని, ఆడపిల్లకు తండ్రి లేదా భర్త కలిగించాలి. అవసరానికి ఆ ఆడపిల్ల కష్టాలకు ఎదురు నిలవాలి (రేపటి చూపు– కూర చిదంబరం), పరిస్థితులనుకూలంగా సనాతన నమ్మకాలను సడలించాలి. ససేమిరా అనొద్దు (కనువిప్పు–స్వాతి శ్రీపాద) లాంటి హితవులెన్నో ఉన్నాయి. గొప్పఎత్తుగడ కథాంతంలో ఊహించని మలుపు (గొంతులో ముల్లు– పి.వి.బి. శ్రీరామమూర్తి) మంచి కథనం (ఎక్కడ ఉన్నా ఏమైనా..కస్తూరి రాజశేఖర్) మంచి కథా సంకలనానికుండే లక్షణాలన్నీ... ఉన్నాయనే చెప్పుకోవచ్చు. అయితే ఒక్క కథ 'తల్లి వేరు'లో దసరా పండక్కి సొంతూరు వెళ్ళిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ప్రశాంత్ మిత్రులకు 'మందు'తో విందు చేయటం, ఊరిలోని పారిశుద్ధ్య కార్మికులకు, ఇతర పనులు చేసే వాళ్ళకు తలా ఓ క్వార్టర్! సీసా ఇవ్వటం ఆ ఊరి సంస్కృతిలో భాగం కావొచ్చు,కాని ధూమపానం, మద్య పానం ఆరోగ్యానికి చెరుపు అనే మన పౌరసూచనలకు విరుద్ధమై తప్పుడు సంకేతాలిచ్చినట్లు అనిపిస్తుంది బహుమతి కథ.

మంచి కథా సంకలనానికుండవలసిన లక్షణాలన్నీ స్థూలంగా ఉన్నాయని చెప్పుకోవచ్చును. నిర్వహణ భారం చేపట్టి మంచి కథలందించిన సదా మన సుధామగారికి అభినందనం.

**ప్రతులకు:** ప్రజా పత్రిక
జాతీయ తెలుగు వారపత్రిక
21-11-14/3, కోర్లమ్మపేట
రాజమండ్రి–533 104
సెల్: 98480 96374



– కూర చిదంబరం
సెల్: 8639338675

## దేదీప్య చైతన్య'మూర్తి'



తుఫానులు, గాలిదుమారాలు, పెనుగాలులు
నిన్న మొన్న గలగలా మాట్లాడిన మిత్రులు
ఉన్నట్లుండి అంతర్ధానమయ్యే అనూహ్య అదృశ్య విషాదాలు
మనకు కొత్తేమీ కాదు
తరచూ చూస్తూ అశ్రునయనాలతో
అంజలిస్తూనే ఉన్నాం.
వరికంకులు మిలమిలా మెరిసే
నవనవోజ్వల పరిణత సమయంలో
పలువన్నెల విరిబాలలు పరిమళాలు చిందే
దశమివెన్నెల శుక్లసంరంభంలో
తుఫాను ఎంతపని చేసింది?
నిన్ను రణబాధితుడిని, గ్రహణపీడితునీ చేసి
అక్షరలోకంలోంచి అనంతలోకాలకు చేర్చింది!
నువ్వు దివాకర్లలా, రాళ్ళబండిలా, శ్రీహరిలా
మా అనుమానాలు మాయం చేసేవాడివి.
పేరులో బాలుడివే కానీ
అధ్యయనంలో, సమయస్ఫూర్తిలో,
సందర్భోచిత ఉటంకింపుల్లో
నువ్వొక దేదీప్య చైతన్య'మూర్తి'వి.
వర్తమాన సాహితీ క్షేత్రంలో
నీదో మర్యాదలనతిక్రమించని సుమధుర గళం.
సమ్మోహన విశ్వరూపం.
అన్నా అంటూ ఆత్మీయ ప్రసంగం ఆరంభించడానికీ
టైమవుతోంది.
ఏ వేదికమీద ఉన్నా తొందరగా రావా!
(గుమ్మన్నగారి బాలశ్రీనివాసమూర్తి
సంస్మరణలో )



– చీకోలు సుందరయ్య
9030000696

# అతడు మత వృక్షాల వేళ్ళు నరికి బోధి వృక్షాలు నాటాడు



-డా॥కత్తి పద్మారావు
9849741695.

అతడు దీర్ఘ సంభాషణ చేశాడు.
ఆ గ్రామాన్ని తిప్పి కట్టాలనే
అతని తపన.
వారి కన్నీళ్ళ వెనుక గుండె సొద
లేదని ఆయన ఎరుకపడ్డాడు.
అవి అలవాటుగా రాలుతున్న
నాలుగు చుక్కలు.
వేదన ఎక్కడుంది?
అది సామాజికమైందా?వైక్తికమైందా?
వ్యక్తుల సమూహం సమాజం నిజమే!
సమాజానికి సామూహిక
వేదన ఉంది.
సామూహిక వేదనపై
అణిచివేత ఉంది.
దోపిడీ ఉంది.
నిర్లక్ష్యం ఉంది.
నిరాదరణ ఉంది.
అస్పృశ్యత ఉంది.
వ్యక్తి దేనికి మధనపడుతున్నాడు?
సాంప్రదాయాన్ని
అనుసరించలేకపోతున్నాననా?
కోరికల ఊబిలో మునిగి ఉన్నాననా?
ఏ కోరికా తీరడం లేదనా?
కోరిక రంపమై
గాయాలు చేస్తుందనా?
దేనికి దుఃఖపడుతున్నాడు?
దుఃఖం కలిగించేదా?
కలిగిందా?
కలిగించేదేవరు?
ఎవరికి కలిగింది?
కన్నీళ్లు తుడిస్తే దుఃఖం పోతుందా?
సమాజాన్ని మారిస్తే
దుఃఖం పోతుందా?
ఆ నవ యవ్వన వధువుని
మంటల్లో కాల్చినప్పుడు
కాల్చిన వాళ్ళ ఆనందించినప్పుడు
దుఃఖాన్ని ఎవరు కలిగించారు
అనే ప్రశ్న రాలేదా?
ఆ శంభూకుడు వేదం చదువుతున్నప్పుడు
తలను నరికిన రాముడు
దుఃఖం కలిగించాడా?
దుఃఖం తొలగించాడా?
ఇది అంబేద్కర్ వేసిన ప్రశ్న.
అంబేద్కర్ ఎవరిని అనుసరించాడు?
తథాగతుడినే అనుసరించాడు.
అవును! ఊళ్లు ఏమి మారాయి?
అక్కడ మరణం రణం
చేస్తూనే ఉంది.
పండిన పంట అంతా
పులిసిన ఊటలో కరిగిపోతుంది.
అందుకే
ఊళ్లను మళ్ళీ తిరిగి
కట్టాలంటాడు ఆయన.
మగనికి గ్లాసుల్లో మందు పోస్తున్న
సతి దిగులుగా చూస్తుంది.
ఇతడు నా ముందే రాలిపోతాడని !
ఏంటి? మంచీ – చెడుకూ
ఈ మందు చిందులు !?
కోట్ల తలకాయల్లో
ఆలోచించే బుర్రలెన్ని?
ఎకరాలకు ఎకరాలు అమ్మి
అప్పుల సుడుల్లో
మునిగి పోతున్నవాళ్లు ఎంతమంది?
పండుగలకు, పబ్బాలకు,
చావులకు, పెళ్లిళ్లకేగా
మీ కాసులు కరిగిపోతుంది.
వేమన గుర్తొస్తున్నాడు.
కాకి పిండం కథను చెప్పి వెళుతున్నాడు.
ఇక వీరికి జ్ఞానమెప్పుడు
ఆవిష్కరించబడుతుంది?
అవును!
మీరు ఇలానే జీవించండి!
మిమ్మల్ని దోచుకునే వాళ్లంతా.

మీ అజ్ఞానాన్ని పెట్టుబడిగా పెట్టుకుంటున్నారు.
ఈ భూమికి సారమంతా పోతుంది.
సౌడు నేలల్లో విత్తనాలు
పొటమరిస్తాయంటారా?
అందుకే ఆయన
ఊడలు దిగిన మత వృక్షాల
వేళ్ళు నరికి
బోధి వృక్షాలు నాటాడు.
ఆ వృక్షం మీద దయ్యాలు
భూతాలు ఉండవు.
ఆ ఆకులు ఔషధాలుగా
ఉపయోగపడతాయి.
సాంఖ్య శాస్త్రం ఏమి చెప్పింది?
పదార్థం నుండి చైతన్యం పుడుతుందని చెప్పలేదా?
చార్వాకులు, లోకాయతలు
మీతో మాట్లాడటం లేదా?
మీరు నివసించే నేలను
అర్థం చేసుకోకుండా,
మీరు తాగే నీటిని కలుషితం చేసుకుంటూ..
మీరు పీల్చే గాలిని
కాలుష్యం చేస్తున్న మీ జీవితానికి
అర్థం ఉందంటారా?
ఆ ఊరి నుండి ఇంకా జోలి కట్టుకుని
బాలింతను తీసుకెళుతూనే ఉన్నారు.
ఆ ఊరి నడిబొడ్డులో ఇంకా గ్లాసులు
వేరుగా వేలాడుతూనే ఉన్నాయి.
ఆ జంధ్యపు వైద్యుడు ఇంకా
నాడి పట్టుకోవడానికి వెనకాడుతూనే ఉన్నాడు.
ఆ మాస్టారు కళ్ళల్లో అక్షరాలు
నేర్పడానికి ఇంకా ద్వేషం
కొట్టవచ్చినట్టు కనపడుతుంది.
ఆ జమ్మి చెట్టుకు వేముల రోహిత్
వేలాడుతున్నాడు.
ఆ విశ్వవిద్యాలయాల్లో
రాముడు విల్లంబులుతో..
కృష్ణుడు సుదర్శన చక్రంతో
వధ కోసం తిరుగుతూనే ఉన్నారు.
ఆ భీష్ముడు అంపశయ్యపై
వధ ధర్మాన్ని బోధిస్తూనే ఉన్నాడు.
అందుకే బోధిసత్వుడు
కొత్త చెట్లు నాటమన్నాడు.
ఒక్క నమ్మకంతో బతకాల్సిన మనిషి
ఒక్క మూఢనమ్మకంతో మరణిస్తున్నాడు.
చెట్టు ఓ జ్ఞానం.
కొండ ఓ భౌగోళిక శాస్త్రం.
నది ఒక జీవన గమనం.
కడలి ఓ బతుకు పుస్తకం.
అంబేద్కర్ ఆ బోధి వృక్షం కిందే
మానవధర్మాన్ని మననం చేసాడు.
నిజమే!
దుఃఖం జ్ఞానం వల్లే పోతుంది.
సంభాషణ అంటే
జీవితాన్ని మార్చేదే.
దీర్ఘ సంభాషణ అంటే
సమాజాన్ని మార్చే సూత్రమే.
మనం బుద్ధునితో
అంబేద్కర్ తో సంభాషిద్దాం.
మన ఊరినీ, మన ఆలోచనని
మార్చుకుందాం.
అప్పుడే బోధివృక్షాలకు
జ్ఞానపుష్పాలు వికసిస్తాయి.

# 'బహుజన మహిళా కలాలు' పుస్తకావిష్కరణ




పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ విజయభారతి

మహిళలు సమిష్టిగా కృషి చేస్తే సాధ్యం కానిదంటూ లేదని బోయి భీమన్న కుమార్తె ప్రొ॥విజయ భారతి పిలుపునిచ్చారు. మహిళలకు చేయూతనిచ్చే సంస్థ చంటి ప్రసన్న కేంద్రం ఆధ్వర్యంలో 'బహుజన మహిళా కలాలు' పేరిట రూపొందించిన పుస్తకావిష్కరణ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ హెచ్ ఓడి ఆచార్య సూర్య ధనంజయ్, విశ్రాంత ఆచార్యులు సక్కు భవ్య, సీనియర్ ముస్లిం రచయిత్రి షహనాజ్ బేగం, దేవనార్ విజువల్లీ ఛాలెంజ్డ్ స్కూల్ వ్యవస్థాపకులు జ్యోతి సాయిబాబాతోపాటు పలువురు రచయిత్రులు పాల్గొన్నారు. చంటి ప్రసన్న కేంద్రం(సిపికె) నిర్వాహకురాలు రాజీవ వాసన్ సారథ్యంలో బహుజన మహిళా కలాలు పేరిట ఆవిష్కరించిన ఈ పుస్తకంలో 75మంది బహుజన రచయిత్రుల స్వగతాలను పొందుపరిచారు. ఈ పుస్తకం చారిత్రాత్మక పుస్తకం అవుతుందని విజయ భారతి ఆకాంక్షించారు. రచనా రంగంలో మహిళలు రాణించాలంటే ఎన్నో సమస్యల్ని అధిగమించి ముందుకు రావలసి ఉంటుందని చెప్పారు. తాము ఎదిగే కాలంలో మహిళలకు ఎన్నో కట్టుబాట్లు ఉండేవని, అటువంటి కట్టుబాట్లు ఈరోజుల్లో కాస్తంత సడలాయని విజయభారతి అభిప్రాయపడ్డారు. అగ్రకులాల్లో మహిళలు భక్తిభావం వైపు పరుగెడుతున్నారని, బహుజన మహిళలు వారిని అనుసరిస్తుంటారని చెప్పారు. అలా అనుసరించే మహిళలను చైతన్యపరచాల్సిన బాధ్యత బహుజన రచయిత్రులపై ఉందని సూచించారు. రచయిత్రులు తమ రచనల్లో ప్రగతిశీల భావాలు ఉండాలని స్పష్టం చేశారు.

కార్యక్రమంలో సూర్యధనంజయ్ మాట్లాడుతూ సామాజిక అంశాలపైనే దృష్టి పెట్టి కథలు రాసే రచయిత్రులు తమ స్వగతాలను ఆవిష్కరించడం సాధారణ విషయం కాదన్నారు. ఎంతో కష్టపడి మహిళలు రచనా రంగంలో రాణిస్తుండటం పట్ల హర్షం వ్యక్తంచేశారు. అనంతరం సక్కు భవ్య మాట్లాడుతూ పుస్తకాలు ఎన్నో వస్తున్నప్పటికీ చదివేవారు తగ్గిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన తరం గ్రంథాలయాలకు వెళ్ళేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత రచయితలే తీసుకోవలసిన అవసరం ఉందన్నారు. రచయిత్రి షహనాజ్ బేగం మాట్లాడుతూ రచనా వ్యాసంగం ఎంతో కష్టమైనదని, అందరికీ అలవడే విద్య కాదని అభిప్రాయపడ్డారు. అటువంటి విలువైన వృత్తిలో ఆడవారు రాణిస్తున్నప్పుడు ప్రోత్సహించాల్సిన బాధ్యత ఇంటిల్లిపాదిపై ఉంటుందన్నారు. వారికి సరైన తోడ్పాటు అందిస్తే మరింత ముందుకు సాగుతారని చెప్పారు. కార్యక్రమంలో జ్యోతి సాయిబాబ మాట్లాడుతూ కంటి చూపు లేని వారు కూడా రచనా రంగంలో రాణించే అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో హాజరైన రచయిత్రులు అందరూ తమ తమ నేపథ్యాలను ఆహూతులతో పంచుకున్నారు. ప్రముఖ కవయిత్రులు తెలంగాణ సాహితి బాధ్యులు నస్రీన్ ఖాన్, సలీమా, డాక్టర్ యాకమ్మ తదితరులు పాల్గొన్నారు.



కవన కిరణాలు మూడవ కవితా సంకలనం ఆవిష్కరణలో శివమంచాల, జి.జి.రావు, సాహిత్యప్రకాశ్, పోతు రాజారాం, బైస దేవదాసు, ఆవిష్కర్త డా॥నందిని సిధారెడ్డి, దేవానంద్ నాగెళ్ళ, మౌనశ్రీ మల్లిక్, దీపక్‌న్యాతి, పి. పద్మావతి, లింగుట్ల వేంకటేశ్వర్లు.

# అందరిని కలిపేది కవిత్వమే

**-డా॥ నందిని సిధారెడ్డి**

కవిత్వం రాస్తే ఏమొస్తుంది? కవిత్వం చదివితే ఏమొస్తుందని కొందరంటుంటారు. కవిత్వం అందరిని కలుపుతుందని అందుకు ఈ సభ సాక్షమని సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షులు డా॥ నందిని సిధారెడ్డి అన్నారు. ఏప్రిల్ 29 శనివారం రవీంద్రభారతి సమావేశ మందిరంలో జరిగిన "కవన కిరణాలు తెలుగు సాహిత్య సమాఖ్య'' మూడవ వార్షికోత్సవంలో నందిని సిధారెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.



బైస దేవదాసు దంపతులకు పురస్కారం ప్రదానం చేస్తోన్న అతిథులు.

కవిత్వం రాయడం వల్లే ఆయా ప్రాంతాల నుండి ఈ సభకు కవులందరు పాల్గొనగలిగారని, ఇలా కలుసుకోవడం వల్ల మనలో ప్రేమలు, బందాలు పెరుగుతాయని అన్నారు. డబ్బు యావలో పడిపోయి సమాజంలో కొందరు ప్రేమలకు, బంధాలకు, దూరమవుతున్నారని, ఒకసారి అనారోగ్యంతో మంచాన పడ్డపుడు ప్రేమలు బందాలు గుర్తొస్తాయని అపుడు ఎంత ఏడ్చినా ప్రయోజన ముండదని ఎన్నో సంఘటనలు వివరించారు.

మనిషిలో నేను అన్న అహం వున్నంతకాలం సమస్యల సుడిగుండంలో చిక్కుకుపోతాడని, అహం విడనాడిన నాడుమనిషి స్వేచ్ఛగా, ఆనందంగా జీవిస్తాడని తెలిపారు. మనలో ఇగో అనేది చిన్న చిన్న విషయాలే పెద్దవై మనమధ్యవున్న బందాలు తెగిపోయి ఆర్థికంగా, మానసికంగా కృంగిపోతామని అందుకు ఈ మధ్య వచ్చిన బలగం సినిమా చూస్తే తెలుస్తుందన్నారు. బలగం సినిమా ప్రతి ఒక్కరి మనసును కదిలిస్తోందని అందుకే అన్ని వర్గాల ప్రజలు ఆ సినిమాను ఆదరిస్తున్నారని అన్నారు.

అలా కవిత్వం కూడా మనసును తాకేట్టు వుండాలని మంచి కవిత్వానికి ఎప్పుడూ గుర్తింపు వుంటుందని అలాంటి కవిత్వమే పది కాలాలు గుర్తుంటుందని అన్నారు. అందరు ఇలా కలుసుకోవడానికి వీలుంటుందని తెలిపారు. అనంతరం 'కవన కిరణాలు' మూడవ కవితా సంకలనం డా॥ నందిని సిదారెడ్డి ఆవిష్కరించగా పి. పద్మావతి రచించిన మూడు పుస్తకాల్లో ''అమృత ధారలు'' దేవానంద్ నాగెల్ల, 'దివిటీలు' బైస దేవదాసు, 'జీనేకా నామ్ జిందగీ'ని పోతురాజారాం ఆవిష్కరించారు. మరో పుస్తకం ఎం.వి. ఉమాదేవి రచించిన 'వనజ శతకం'ను మౌనశ్రీ మల్లిక్ ఆవిష్కరించారు.

కవన కిరణాలు తెలుగు సాహితీ సమాఖ్య మూడవ వార్షికోత్సవం సందర్భంగా 2023 సంవత్సరానికి గాను నేటినిజం సంపాదకులు బైస దేవదాసుకు ,ఆంధ్ర మహాసభ మాజీ చైర్మన్ పోతు రాజారాంలకు 'సాహిత్య సామాజిక విశిష్ఠ సేవారత్న జాతీయ పురస్కారం' ప్రదానం చేశారు.

ఈ పురస్కారం నేటినిజం పత్రికను విజయవంతంగా నడపడానికి తనలో మరింత బాధ్యతను పెంచిందని బైస దేవదాసు అన్నారు. ఈ పురస్కారానికి తనను ఎంపిక చేసి ఘనంగా సత్కరించినందుకు మరో పురస్కార గ్రహిత పోతు రాజారాం సంస్థకుధన్యవాదాలు తెలిపారు.

సాహిత్యంపై మక్కువతో ముంబాయి నుండి వచ్చానని ఈ మూడవ కవితా సంకలనం ముద్రించే అవకాశం లభించినందుకు అదృష్టంగా భావిస్తున్నాని, కవన కిరణాలు సంస్థకు తన సహకారం ఎప్పుడూ వుంటుందని గౌరవ అతిథి బహుజన సాహిత్య అకాడమీ మహారాష్ట్ర శాఖ అధ్యక్షులు దేవానంద్ నాగెళ్ళ అన్నారు.

కవిత్వం రాయడం వల్లే గొప్పగా జీవించడానికి, గొప్పగా ఆలోచించడానికి మార్గం సుగమమవు తుందని సినీ, టీవీ, గీత రచయిత మౌనశ్రీ మల్లిక్ అన్నారు. కవన కిరణాలు తెలుగు సాహితీ సమాఖ్యను ఏర్పాటు చేసి ఎందరెందరో కవులను ప్రోత్సహిస్తున్న వ్యవస్థాపక అధ్యక్షులు శివమంచాలను సినీ, టీవీ నటులు సాహిత్య ప్రకాశ్ అభినందించారు. సినీ దర్శకులు, నంది అవార్డు గ్రహిత దీపక్ న్యాతి, జ్ఞానేశ్వర్, ప్రజ్ఞ, డా॥ అనిల్‌కుమార్, తదితరులు ప్రసంగించారు.

కవయిత్రి పి. పద్మావతి మాట్లాడుతు కవిత్వం రాయడం వల్ల నా జీవితం ఆనందమయమైందని, తన కృషికి సహకరిస్తున్న వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. సంస్థను విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్న శివమంచాలను అభినందించారు.

తమ సంస్థలో సభ్యులుగా చేరి నిరంతరం కవిత్వ కృషి చేస్తున్న వారందరికీ సంస్థ అధ్యక్షులు లింగుట్ల వేంకటేశ్వర్లు ప్రధాన కార్యదర్శి జి.జి.రావు అభినందనలు తెలిపారు.

వ్యవస్థాపక అధ్యక్షులు సభాధ్యక్షులు శ్రీ శివ మంచాల మాట్లాడుతూ.. ఔత్సాహిక రచయితలను ప్రోత్సహించే దిశగా.. విరివిగా కవితా, కథా సంకలనాలను తీసుకురావటమే లక్ష్యంగా సంస్థ పనిచేస్తుందని, సంస్థ యొక్క కార్యక్రమాలను విజవంతం చేయటానికి తన శాయశక్తులా కృషి చేస్తానని, సంస్థ తలపెట్టిన పనులను విజయవంతం చేయుటలో శ్రీ దేవానంద్ నాగెల్ల/ సంస్థ సభ్యుల సహాయ సహకారాలు ఎప్పటికి మర్చిపోలేనని, వారి ప్రోత్సాహంతో తను ఇంకా ఉత్సాహంగా పని చేస్తానని చెప్పారు. ఈ మూడవ సంకలనానికి సహకరించిన అందరికి,ఆవిష్కరణకు విచ్చేసిన సభ్యులకు, అతిథులకు కృతజ్ఞతలు తెలియచేశారు.

కార్యక్రమానికి విచ్చేసిన,కవులకు, కవయిత్రులకు నిర్వాహకులు సన్మానం,ప్రశంసా పత్రాలను అందించిన సత్కరించారు.



పోతు రాజారాంకు పురస్కారం ప్రదానం చేస్తున్న అతిథులు.



సభలో ప్రసంగిస్తున్న శివమంచాల, డా॥ నందిని సిధారెడ్డి, బైస దేవదాసు, మౌనశ్రీ మల్లిక్, సాహిత్య ప్రకాశ్, దీపక్ న్యాతి,జి.జి. రావు, లింగుట్ల వెంకటేశ్వర్లు, దేవానంద్ నాగేళ్ల, ప్రజ్ఞ, పి. పద్మావతి.



పి. పద్మావతి రచించిన 'అమృతధారలు, 'దివిటీలు', 'జీనేకా నామ్ జిందగి', ఎం.వి.ఉమాదేవి రచన 'వనజ శతకం' పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అతిథులు.

## కార్మికుల దినోత్సవం

అంతర్జాతీయ కార్మికుల రోజు మే డే
కూడుకై, గుడ్డకై, నిరంతరము పోరాడుతూ
పుట్టిన నేలను విడిచి సరిహద్దులు దాటిన
వలస కూలీలు ఎందరో....

బతుకు పోరులో మట్టితో స్నేహం చేసి
చివరకు మట్టికరించిన మట్టి మనుషులు
లేబర్ అనగానే పేదరికం నిజాయితీ,
గల కార్మికుల ఆత్మగౌరవానికి ప్రతీక

అడ్డా మీద కూలీల వేషం కట్టి
రోడ్లు, భవనాల శంకుస్థాపన మొదలు
ప్రారంభోత్సవం దాకా కార్మికుల శ్రమ
అద్భుత కట్టడాలకు మూలం కార్మికులు
లేబరంటే గరీబోల్లు కాదు
ఔదార్యం చాటుకునే వాళ్ళు....
లేబరంటే జీతగాల్లు కాదు
సమాజంపై భాద్యత గల పౌరులు.....

ఆర్థిక అసమానతలు తొలగి అభివృద్ధి కై
ఆరాట పడుతున్న కార్మిక వర్గం.......
కార్మికుల సంక్షేమానికై ప్రభుత్వాల కృషి.



-మిద్దె సురేష్,
9701209355



## మేడే!

కార్మిక దినోత్సవం మేడే మేడే!
కర్మవీర ఘనోత్సవం నేడే నేడే!
॥కా॥

చికాగో నగరంలో
చిక్కుల పనిభారంతో
నలుగుతున్న కార్మికులు
రగులుతున్న శ్రామికులు
సోషలిస్టు-కమ్యునిస్టు
సోదర పార్టీలతో
భుజంచరిచి, నిజంతరచి
భుజంగాల మాదిరిగా
భూస్వామ్య వ్యవస్థపై
బుసగొట్టిన సుదినమిదే!
శ్రమదోపిడి చేస్తున్న
సంపన్నుల ఫాక్టరీల
పొగగొట్టం పొగరణచగ
పోరాడిన సుదినమిదే! ॥కా॥
పరిమితమన్నది లేనీ
పలుగంటల శ్రమలనెల్ల
ఎనిమిది గంటలు చేయగ
ఏకమైన కార్మికులు
ఎలుగెత్తిన సుదినమిదే!
ధ్వజమెత్తిన సుదినమిదే
తుచ్ఛ పాలనా రంగం
తుపాకులే గురిపెట్టగ
కార్మిక సోదర రక్తం
కాలువలై ప్రవహించగ.

తడిసిన చొక్కాలన్నా
ఎర్రెర్రని జెండాలై
చిర్రెత్తిన విప్లవాల
శిరసెత్తిన సుదినమిదే!



- డా॥వద్దేపల్లి కృష్ణ
సెల్:9246541699

## మేడే ఈనాడే

పదండి..పదండి
కార్మిక శక్తిలో మొలకెత్తిన
చైతన్య మొక్కను చూద్దాం
ఉద్యమాల ఊపిరితో
వెలుగుచున్న వేగుచుక్క
తూర్పున పొడిచే
ఎరుపెక్కిన సూర్యుడివైపు
ముందుకు నడవండి
కార్మికశక్తి కర్షక యుక్తి
కలిసినతోవలో కదలండి
శ్రమజీవుల చమటతో తడిచిననేలను

ఎర్రకాంతుల జెండాలు చూద్దాం
కార్మికుల హక్కుల పోరాట పటిమను
సంఘటితమై నడిచిన దినం
కర్తవ్యం గుర్తు చేసే.. మేడే ఈనాడే

అండగానిలిచి చైతన్య జెండాను
పాతిన దినం కార్మికశక్తికి
తిరుగేలేదని ఉద్యమించిన సమరం

సాహసంతో సాగండి
ఆవేశంతో అడుగు వేయండి
కదం తొక్కే ధైర్యముంటే
పదం.. పాడే గళమే ఉంటే
దళమై కదలండి
కార్మికులపై జరిగే దౌర్జన్యం
కళ్లారా చూడండి

ధరణి దారి చూపెడుతుంది
ఒక కొత్త వింత కన బడుతుంది
మీ మనసుకు పులకింతను
మీ లోకి తెప్పిస్తుంది.

తలుచుకోండి ఇది నిజమని..!
మీ తనువులో అణువణువు
వణుకుపుడుతుంది
ఎక్కడ చూసినా అక్కడకి
మీ మనసు దారి తప్పుతుంది
కొత్త బాటలను వెతుకు తుంది
మీ రక్తం ఉప్పొంగుతుంది.

చిమ్మ చీకటిని చీల్చుకుంటూ
సొమ్మ సిల్లిన వెలుతురు
భయం తెలియని బాధ ఒక్కటి
కళ్ళముందు కనబడుతుంది
కార్మిక నినాదం వినబడుతుంది
ఎవరివో పలవరింతలు
బాధతోనే పలకరింతలు
ఆదుకోమని కోరినట్లు
దగాపడి దిగులు చెందిన
ఓ నినాద స్ఫూర్తి
నడిపించిన దారి
బాధాసర్పద్రష్టులు
బతకలేని కార్మికులు
బరువెక్కిన బతుకులు
బాధలతో నిండిన జీవితాలు.

తర తరాల దారిద్ర్యాన్ని
మోస్తున్నా అభాగ్యులు
యుగయుగాల దోపిడీకి
గురియైన నిర్భాగ్యులు
నిజమైన శ్రామికులు
దిక్కు దిక్కున డొక్కలెండిన
దీనులెందరో కనబడుతారు.
ఎక్కడచూస్తే అక్కడ వాళ్లే
లోకమంతా లోకువై
తిరిగేవాళ్ళు వీరే
నిత్యం కష్టం వెంట బెట్టుకొని
రెక్కలు ముక్కలు చేసికొని
కడుపు నిండని దిక్కులేని
వారెందరో కార్మికులు అగుపిస్తారు.

ఆకలితో అలసటతో
ఆవేశం ఆశయంగా
పారే చీకటి అలలను
దాటు కుంటూ నిశ్శబ్దాన్ని
చీల్చుకుంటూ..సాగే నడక
ఏమి ఎరుగని వారు
తెలిసీ తెలియని వారు
శాంతముగా సాగేవారు
కష్టజీవులు కార్మికులు
చూడండి చూసి ఆనందిస్తారా..!
లేక ఆదరించి ఆదుకుంటారా..!
అంతా మీ ఇష్టం..!!



-అంబటి నారాయణ
9849326801

## శ్రమదోపిడిని నినదించిన 'మే డే' నేడే

**కార్మికుల పోరాటాల త్యాగఫలమే మేడే.**

కడుపు మండిన కార్మికవర్గం సంధించిన తొలి విప్లవం మేడే. ఆరుగురు వీరుల రక్తతర్పణానికి, ప్రాణ త్యాగానికి నిదర్శనం మేడే. కార్మికులలో స్ఫూర్తినింపేది మే డే .

పెట్టుబడిదారీ వ్యవస్థకు, కార్మిక దోపిడీకి వ్యతిరేకంగా కార్మికవర్గం నినదించిన రోజు మే డే. వెట్టిచాకిరీకి, శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా దాదాపు 137సంవత్సరాల క్రితం 1886 వ సంవత్సరం మే 1 వ తేదీన అమెరికాలోని షికాగో నగరంలోని హే మార్కెట్ లో కార్మికుల ప్రదర్శన జరిగింది. సరిగ్గా ప్రదర్శన మూడోరోజు చేరేసరికి అధిక మొత్తంలో కార్మికులు ఈ ప్రదర్శనలో పాల్గొని రోజుకు 8గంటల పని విధానం నినాదంతో ఉద్యమించారు.అది కాస్తా ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఒక పోలీసు సార్జంట్ మృతిచెందడంతో కోపోద్రిక్తులైన వారు అక్కడ హాజరైన నిరాయుధులైన కార్మికుల పై విరుచుకుపడ్డారు.ఈ ఘటనలో పోలీసులు,కార్మికులు ప్రాణాలొదిలారు. ఇది జరిగిన మరుసటి రోజు ఆందోళనలు మరీ తీవ్రతరం అయ్యింది.ఈవిధంగా షికాగోలోనిహే మార్కెట్ రక్తపుమడుగుల్లో ఆవిర్భవించి, ప్రపంచమంతటా వ్యాపించింది కార్మిక విప్లవం. పారిశ్రామిక విప్లవం ప్రారంభమైన ఆ తొలిరోజుల్లో పారిశ్రామిక వేత్తలు అధిక లాభాల కోసం చిన్న పిల్లలతో, మహిళలతో రోజుకు 18 నుండి 20 గంటలు పని చేయించే వారు.ఆ సమయంలో శ్రామికుల బతుకులు చాలా దుర్భరంగా ఉండేవి.

అందుకే వెట్టి చాకిరి నుంచి విముక్తి కల్పించి, కార్మిక హక్కులను పరిరక్షించాలని ఉద్యమించారు. తర్వాత 1889-1890 మధ్య అనేక కార్మిక నిరసనలు జరిగాయి.1890 మే1న బ్రిటన్ లోని హైడ్ పార్క్ లో జరిగిన ప్రదర్శనకు మూడు లక్షల మంది కార్మికులు పాల్గొన్నారు. రోజుకు ఎనిమిది గంటలు మాత్రమే పనిచేసే నిబంధనను అమలు చేయాలన్నది వారి యొక్క డిమాండ్. ఆ తర్వాత కూడా అనేక దేశాల కార్మికుల నుంచి నిరసనలు కొనసాగాయి. మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో మేడేన యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలు చేసేవారు. నాజీల వ్యతిరేక దినోత్సవం గా, హిట్లర్ పాలనలో జాతీయ కార్మికుల దినోత్సవంగా జరుపుకున్నారు.

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత యూరోపియన్ దేశాల్లో మే1ని సెలవు దినంగా పాటించడం మొదలు పెట్టారు.ఆ తర్వాత అనేక దేశాలు ఇదే బాటలో నడిచాయి .వీటన్నింటి ఫలితమే నేడు రోజుకు ఎనిమిది గంటల పని వేళలు. కార్మిక సంక్షేమ పథకాలకు,కార్మిక ఉద్యమాలకు ఊపిరి పోసుకున్న మేడే భారత్ లో

మొదటిసారి 1923 మే 1 న మద్రాసులోని లేబర్ కిసాన్ పార్టీ ఆధ్వర్యంలో కార్మిక దినోత్సవం జరిగింది పెట్టుబడిదారీ ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా కార్మికవర్గం, ట్రేడ్ యూనియన్‌లు ఈ రోజున ధర్నాలు ర్యాలీలు ప్రదర్శనలు చేపడతాయి.

'శ్రమ జీవన సౌందర్యానికి సమానమైనది లేనే లేదోయ్' అన్నాడు మహాకవి శ్రీశ్రీ.సమాజ పురోగతికై శ్రమిస్తున్న శ్రామికుల శ్రమ దారుణంగా దోపిడీకి గురైన పుడు కష్టించే చేతులు పిడికిలి బిగించి,ఒక్కటై ఉద్యమాలు చేస్తాయి .ఆ విధంగా ఉద్యమాలు పురుడుపోసుకున్నటువంటి ఈ రోజు మే డే అంతర్జాతీయ కార్మిక దినోత్సవం. ఆ ఉద్యమాల ఫలితంగానే కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. రోజుకు ఎనిమిది గంటల పని సమయం,పనికి తగ్గ కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించడం ప్రభుత్వం, యాజమాన్యాలు బాధ్యత. ఇందుకోసం కార్మిక సంఘాల చట్టం 1926, కనీస వేతనాల చట్టం1976, వెట్టిచాకిరీ నిషేధ చట్టం 1974 రూపొందించబడ్డాయి.కానీ ప్రస్తుతం కాంట్రాక్టు,ఔట్ సోర్సింగ్,హవర్ బేస్డ్, గెస్ట్ ఫ్యాకల్టీ,కాంటింజెంట్ మొదలగు పేర్లతో నాటి శతాబ్ద కాలం నాటి శ్రమ దోపిడి నేటికీ జరుగుతూనే ఉన్నది.

కార్మిక సంక్షేమం కోసం కృషి చేస్తున్న ప్రభుత్వం చేపట్టే సంస్కరణలు కార్మికులకు కొత్త కష్టాలు తేకూడదని,మారుతున్న కార్మిక చట్టాలు కార్మికుల పాలిట శాపం కాకుండా ఉంటేనే శ్రామికులను మరియు వారి శ్రమను గౌరవించినట్లవుతుంది. కోట్లాది మంది కార్మికులందరికీ మే డే శుభాకాంక్షలు.



-'కమలేకర్ నాగేశ్వర్ రావు 'కమల్'
9848493223

## శ్రమ శక్తి గీతిక

మేడే
కార్మిక,కర్షక
కష్టజీవులు చెమటోడ్చిన
విజయ పతాకం
ప్రపంచ గగనాన
రెపరెపలాడిన
శ్రమశక్తి పతాకం.
కాలపరిమితిలేని
శ్రమశక్తి దోపిడికి
స్వస్తి పలికి
ఆకలి అన్నార్తుల
పీడితుల హక్కుల సాధనకై
రోజుకు పని,విశ్రాంతి,వినోదం
ఎనిమిదేసి గంటల విభజనే
ధ్యేయంగ,కదంతొక్కి
విజయపథం చేపట్టిన రోజు,
రెపరెపలాడిన పతాకమే
మేడే పతాకం.
పారిశ్రామిక,యాంత్రిక
క్యాపిటలిస్టు యుగంలో
సామాజిక స్పృహ, చైతన్యం పెరిగి
అన్యాయాలు,అక్రమాలకు
సంకెళ్ళు వేసి,పిడికిళ్లు బిగించి
అందరి గర్జనలు.

ఏకగళంమై కదిలి
విజయగీతాలాపనతో
శ్రమశక్తిపతాక ఎగురవేయగ,
మేడే జరుపుకొనగ,
కదంతొక్కుతూ రండి



-సంధ్య సుత్రావె
9177615967

## ఘనంగా శ్రీ శ్రీ జయంతి వేడుకలు




తెలంగాణ సాహితి అరసం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శ్రీశ్రీ 113 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన శ్రామిక కవి సమ్మేళనంలో పలువురు కవులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలుగు విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఆచార్య ఎస్ వి సత్యనారాయణ మాట్లాడుతూ ఆధునిక తెలుగు సాహిత్యాన్ని భూమార్గాన్ని పట్టించి ప్రభంజనం సృష్టించిన మహాకవి శ్రీశ్రీ అన్నారు. ప్రశ్నించడమే నేరమైన ఈ రోజుల్లో శ్రీశ్రీ అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహితి ప్రధాన కార్యదర్శి కె ఆనంద చారి, అరసం ప్రధాన కార్యదర్శి రాపోలు సుదర్శన్, ప్రముఖ కవి డా॥నాళేశ్వరం శంకరం, కందిమళ్ల ప్రతాపరెడ్డి, తంగిరాల చక్రవర్తి, నస్రీన్ ఖాన్, అనంతోజు మోహనకృష్ణ, సలీమా తదితరులు పాల్గొన్నారు.ఫొటో: శ్రీ శ్రీ జయంతి సభలో మాట్లాడుతున్న ఆచార్య ఎస్. వి. సత్యనారాయణ

## తెలుగు సాహిత్యంలో విస్ఫోటనం 'శ్రీశ్రీ'

### ఘనంగా మహాకవి శ్రీశ్రీ 113వ జయంతి




తెలుగు సాహిత్యంలో ఒక విస్ఫోటనం మహాకవి శ్రీశ్రీ అని ప్రముఖ కవి, చరిత్రకారుడు ఈతకోట సుబ్బారావు అన్నారు. నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం, సాహితీ స్రవంతి సంయుక్తంగా నిర్వహించిన మహాకవి శ్రీశ్రీ 113వ జయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. జేఎస్ ట్రస్టు బాధ్యులు నరసింహారెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ప్రధాన వక్తగా పాల్గొన్న ఈతకోట సుబ్బారావు మాట్లాడుతూ శ్రీరంగం శ్రీనివాసరావు అంటే ఎవరికీ తెలియదని, శ్రీశ్రీ అంటే అందరికీ పరిచితమేనన్నారు. రెండు అక్షరాల పేరుతోనే సంచలనమైన ఆయన రెండు పదాల్లోనే కవిత్వంలో ఆటంబాంబులు సృష్టించగలిగిన సమర్థత కలిగిన వారన్నారు. కుదిరితే పరిగెత్తు .. లేదంటే నడువు వంటి కవితల ద్వారా సమాజానికి ఉద్యమ స్ఫూర్తి రగిల్చిన గొప్ప కలం శ్రీశ్రీదన్నారు. భవిష్యత్తు మానవ కల్యాణమయం కావాలని స్వప్నించిన గొప్ప మహనీయుడు శ్రీశ్రీ అని కొనియాడారు. అందమైన అబద్దాలైనా గొప్ప కవిత్వాన్ని సృష్టిస్తాయని, కానీ నిష్ఠూరమైన నిజాలతోనే అసలైన సిసలైన కవిత్వం దర్శనీయమవుతుందని శ్రీశ్రీ ఎల్లప్పుడూ విశ్వసించేవారన్నారు. ఆయన నడయాడిన ఆంధ్రదేశంలో పుట్టడం మనందరికీ పూర్వజన్మ సుకృతమేనన్నారు. సముద్రపు అలలు ఎగసి పడిపోతాయని, శ్రీశ్రీ సృష్టించిన ఆధునిక కవితా అలలు నిరంతరం ఎగస్తూనే ఉంటాయన్నారు. సాహితీ స్రవంతి జిల్లా కార్యదర్శి వి. గోపీనాథ్ మాట్లాడుతూ తెలుగు సాహిత్యాభిమానులకు పరిచయం అక్కర్లేని పేరు శ్రీశ్రీ అని అన్నారు. ఆయన కవిత్వంలోని పంక్తులు కదిలించని మనసులు కానీ ఆ కవితా వస్తువులలో తమను దర్శించుకోని మనుషులు కాని ఉండరన్నారు. మానవుడే నా సంగీతం .. మానవుడే నా సందేశం అన్న మహత్తర సంకల్పంతో ఆధునిక కవిత్వ సృజన చేసిన యుగకర్త శ్రీశ్రీ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్. నవకోటేశ్వరరావు, సీహెచ్ శ్రీహరి, గౌస్ బాష, విజయకుమార్, బలరాం, ఆర్. నగేష్, తదితరులు పాల్గొన్నారు.

